క్లుప్తంగా

కల్వరాలలో సామూహిక వ్రతాలు



వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సామూహిక వ్రతాల కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సామూహిక వ్రతాల కార్యక్రమంలో గ్రామంలోని పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం




కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల దత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆదిదంపతులైన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తుల మధ్య శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణానికి కొత్తకోట, కానాయపల్లి, పాలెం, నిర్వేన్ గ్రామాల భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి



పెబ్బేరు రూరల్: కార్మికుల మేనిఫెస్టోపై వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం రాజు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండంతో వనపర్తి జిల్లాలో కొల్లాపూర్, మక్తల్, దేవరకద్ర నియోజకవర్గాల్లోని మండలాలు ఉన్నాయని, అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ నియోజకవర్గ ప్రజల సమస్యలపైన ఎన్నికల ప్రణాళికలు విడుదల చేయాలని కోరారు. అసంఘటిత కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వాలు పాటు పడాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ లను ఉప సంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగుల డివిజన్ అధ్యక్షుడు శివకుమార్, సీఐటీయూ నాయకులు మదన్, గోపాలకృష్ణ, కురుమయ్య, నందిమల్ల రాములు, పరమేశ్వరాచారి, రాబర్ట్, శివవర్మ, మహేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ చేయాలి



గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన గొర్రెకాపర్లు మొత్తం 107 యూనిట్లకు కలెక్టర్ అకౌంట్‌లో డబ్బులు వేశామని, అయినా ఇప్పటి వరకు గొర్రెలు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు రేవల్లి మండలంలోని నాగపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ తమకు వెంటనే గొర్రెలు అందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జక్కరాములు, జక్క ఖతాలు, దొడ్డి కర్రెమల్లయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన మ్యాదరి కాశన్న ఇటీవల మృతి చెందాడు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యుల పరిస్థితిని గమనించిన మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య మృతుడి భార్య వెంకటమ్మ, కుటుంబ సభ్యులకు శనివారం రూ.3 వేల ఆర్థికసాయం అందించారు. ఎలాంటి సమస్యలు వచ్చినా వెన్నంటి ఉండి పార్టీ తరఫున, ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ఆయన భరోసానిచ్చారు.

బియ్యం అందజేత

కోడేరు: మండల కేంద్రానికి చెందిన యాపచెట్టు బాలస్వామి ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో ఆ కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు.



కొత్తకోటలో..



అమరచింతలో..



పాన్‌గల్‌లో..

వాల్మీకి మహర్షి స్ఫూర్తిగా ముందుకు..

కొత్తకోట రూరల్: మహర్షి వాల్మీకి జీవితం అందరికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కానాయపల్లి సమీపంలో ఉన్న వాల్మీకి ఆలయం వద్ద నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వాల్మీకి బోయ ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యుడు భీమన్న నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు విశ్వేశ్వర్, భీంరెడ్డి ఉన్నారు.

అప్పరాలలో..

మండలంలోని అప్పరాలలో సర్పంచ్ హిమబిందు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి ఆలయం దగ్గర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శంకర్‌నాయుడు, బొగ్గు గోవింద్, శంకర్, లక్ష్మన్న, శ్రీను, మొగులన్న తదితరులు ఉన్నారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో, పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో తెలంగాణ ఐక్య వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు అధ్యక్షతన వాల్మీకి మహర్షి జయంతిని వేరువేరుగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, రాజారామ్‌ప్రకాశ్, కేతూరి బుడ్డన్న, శ్రీనివాస్‌గౌడ్, సీతారాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, సుమిత్రమ్మ, ప్రభాకర్ జింకల కృష్ణయ్య, శ్రీనివాసులు, అనుజ్ఞారెడ్డి, గిరిరాజాచారి, చుక్క రాజు, గంధం నాగరాజు పాల్గొన్నారు.

ఆత్మకూర్: వాల్మీకి మహర్షి జయంతిని మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో చైర్‌పర్సన్ గాయత్రి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, వాల్మీకి జేఏసీ రాష్ట్రచైర్మన్ మండ్లరామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కొత్తబోయ శేఖర్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. అలాగే మూలమల్ల, జూరాల, గుంటిపల్లి, మోట్లంపల్లి, మేడేపల్లి గ్రామాల్లో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మురళి, చెట్ల శ్రీనివాసులు, బాలకృష్ణ, వెంకటన్న, మండ్ల విజయ్, వెంకట్రాములు, భీమన్న, సురేందర్, అంజి తదితరులు ఉన్నారు.



సోళీపురంలో ర్యాలీ చేస్తున్న వాల్మీకి నాయకులు

ఖిల్లాఘనపురం: సోళీపురంలో వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వాల్మీకి బోయ సంఘం నాయకులు వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేశారు. మండల కేంద్రంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో మోటర్‌సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు.

అమరచింత: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం పట్టణంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వాల్మీకి యువజన సంఘం నాయకులు బైక్ ర్యాలీ చేయడంతో పాటు వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మీనుగ వెంకటేష్ తొకలి రమేష్, కడియాల నరసింహులు, అంజనేయులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు రఘుపతినాయుడు, తిరుపతినాయుడు, నర్సింహనాయుడు, శేషయ్యనాయుడు ఉన్నారు.



మూలమల్లలో..



ఆత్మకూర్‌లో ..



కడుకుంట్లలో..



అజ్జకొల్లులో..

దాడి ఘటనపై కేసు నమోదు

పాన్‌గల్: స్థలం విషయంలో గొడవ పడి మహిళపై దాడి చేసిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన ఆడెం అలివేల, గురువులమ్మకు ఇద్దరికి పొత్తుల దొడ్డి స్థలం ఉంది. ఈ స్థలంలో ఈనెల 26వ తేదీన గురువులమ్మ కుమారులు వెంకటయ్య, శ్రీను జేసీబీతో చెట్లు తీస్తుండగా.. తనకు తెలియకుండా పొత్తుల స్థలంలో చెట్లు ఎందుకు తీస్తున్నారని అలువేల ప్రశ్నించింది. ఈ స్థలంలో నీకు సంబంధం లేదని వెంకటయ్య, శ్రీను ఇద్దరు కలిసి దాడి చేసి గాయపర్చారని అలివేలు తెలిపారు. ఈ దాడి విషయంపై గ్రామంలోని పెద్ద మనుషులకు చెప్పినా న్యాయం జరగలేదని, దీంతో శనివారం దాడి చేసిన ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని అలివేల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై..

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 20వ తేదీన తెల్లరాళ్లపల్లితండాకు చెందిన నర్సింహ పొలం పనులను ముగించుకొని మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో వనపర్తి నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి నర్సింహను ఢీ కొట్టింది. దీంతో నర్సింహ బైక్‌పై నుంచి రోడ్డుపై కిందపడటంతో బలమైన గాయాలు తగిలాయి. వెంటనే గాయపడిన నర్సింహను జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అజాగ్రత్తగా, వేగంగా నడుపుతూ ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ పేర్కొన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వర్గీకరణ చేపట్టే వరకు ఉద్యమం

ఆత్మకూర్: అర్హులైన దళితులు అన్ని రంగాల్లో వెనుకబడుతున్నారని, వర్గీకరణ చేపట్టే వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్రకార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్ అన్నారు. శనివారం మండలంలోని వీరరాఘవపురం, రేచింతల గ్రామాల్లో సమావేశమై గ్రామకార్యవర్గాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల అధ్యక్షుడిగా కృష్ణయ్య, మురళీ, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, కిష్టన్న, సత్యన్న, శివరాజు, జానయ్య, రవికుమార్, మొగిలన్న, ప్రధాన కార్యదర్శులుగా బాల్‌రాజు, కొండన్న, కళ్యాణ్‌తో పాటు మరో 20 మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నామన్నారు. మందకృష్ణ మాదిగ తలపెట్టిన రథయాత్రకు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అజ్జపాగ మాసన్న, కట్టెలమిషన్ రాజు, గాలిపంపు శ్రీను, కర్రె శ్రీను, జానకీరాం, సోంబాబు, దండు శ్రీను, రేవల్లి శ్రీను ఉన్నారు.



రేచింతలలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మోదీ, అమిత్‌షా చిత్రపటాలకు పాలాభిషేకం



మోదీ, అమిత్‌షా చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రధాని మోదీ, అమిత్‌షా ప్రకటించారని, బీసీ సీఎంతో ప్రజలకు న్యాయం దక్కుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అధ్యక్షతన మోదీ, అమిత్ షా చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే 52శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలలోంచి సీఎంను చేయడం సమానత్వ రాజకీయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, పార్లమెంట్ విస్తారక్ కేతూరి బుడ్డన్న, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, సుమిత్రమ్మ, ప్రభాకర్, నాయకులు జింకల కృష్ణయ్య, శ్రీనివాసులు, అనుజ్ఞారెడ్డి, పెద్దిరాజు, కృష్ణగౌడ్, వెంకటేష్ నాయుడు, నరేంద్ర భూపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఓట్లు అడుగుతాం



సంకిరెడ్డిపల్లిలో మేనిఫెస్టోను వివరిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ మౌనిక



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న అభిలాష్‌రావు

కొత్తకోట రూరల్: సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్ పార్టీకే ఉందని డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భీంరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని సంకిరెడ్డిపల్లిలో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందజేశామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో కొనసాగుతున్నాయన్నారు. బంగారు తెలంగాణ సాధించుకునేందుకు మూడో సారి సీఎంగా కేసీఆర్ ఉంటే సాధ్యమవుతుందని, దేవరకద్ర నియోజవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సాక బాలనారాయణ, కె.శ్రీనివాస్‌జీ, బాలకృష్ణ, నెహ్రూ తదతరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

మండలంలోని నాటవెళ్లికి చెందిన బీజేపీ 6వ వార్డు సభ్యులు గుంద్రాతి నరేష్‌గౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరుతున్న నరేష్‌గౌడ్, మరి కొందరికి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, పాత, కొత్త తేడా లేకుండా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎద్దుల నాగేష్, లక్ష్మణ్‌నాయక్, సురేష్, నెహ్రూ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: ప్రతి కార్యకర్త, నాయకుడు విభేదాలు పక్కన పెట్టి కలిసికట్టుగా బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అభిలాష్‌రావు, ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప, గడపకు వివరిస్తూ కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండీ మునీరుద్దీన్, చంద్రశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఆత్మకూర్: రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి దేశం గర్వించే స్థాయిలో నిలబెట్టిన కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, వైస్‌ఎంపీపీ కోటేష్ అన్నారు. శనివారం మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ గ్రామ కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కారుగుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేపట్టారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రాజు

ఆత్మకూర్: సీపీఎం మండల కార్యదర్శిగా ఎస్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ఎంజీ గార్డెన్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్, రాష్ట్ర నాయకుడు మహమూద్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీఎస్ గోపి ఆధ్వర్యంలో ఎన్నిక జరిగినట్లు తెలిపారు. మండలంలో సీపీఎం బలోపేతానికి కృషి చేస్తానని, సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని మండల కార్యదర్శి రాజు అన్నారు.

పాలస్తీనాపై దాడి హేయమైన చర్య

పెబ్బేరు రూరల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ వనపర్తి పట్టణ కేంద్రంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం అయిదు ప్రదేశాల్లో తోపుడుబండ్ల, మున్సిపల్, భవన నిర్మాణ, బజార్‌హమాలీ, హమాలీ సంఘాల కార్మికుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ అమెరికా అండతో అక్టోబర్ 7 నుంచి పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధకాండ వల్ల 2వేల మంది చిన్నారులు, 6వేల మంది ప్రజలు మరణించగా.. 18వేల మంది ప్రజలు క్షతగాత్రులయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. గాజా ప్రజలకు మందులు, ఆహారం అందనీయడం లేదని వాపోయారు. కార్యక్రమంలో నందిమల్ల రాములు, కురుమయ్య, పరమేశ్వరచారి, గట్టయ్య, నాగన్న, చంద్రయ్య, శివ, సురేందర్, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు



అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని జాతీయ రహదారిపై పోలీసులు శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐలు మాధవరెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రధానంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి



తెల్లరాళ్లపల్లిలో..



పెద్దగూడెంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుదర్శన్

పాన్‌గల్: ప్రభుత్వ బడుల బలోపేతానికి తల్లిదండ్రులు తమ తోడ్పాటునందించాలని తెల్లరాళ్లపల్లి పీఎస్ హెచ్‌ఎం లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. శనివారం పాఠశాలల్లో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. బడుల బలోపేతానికి తల్లిదండ్రులు తమ వంతు తోడ్పాటుతో పాటు సలహాలు అందిస్తే వాటిని స్వీకరిస్తామన్నారు.

తల్లిదండ్రుల సహకారంతోనే..

పెబ్బేరు రూరల్: ప్రభుత్వ బడుల బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని సర్పంచ్ కొండన్న అన్నారు. శనివారం వనపర్తి మండలంలోని పెద్దగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయనతో పాటు ఎంపీడీఓ సుదర్శన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందుతుందన్నారు. ప్రైవేటుకు దీటుగా ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందని వివరించారు. 10వ తరగతి విద్యార్థులను తల్లిదండ్రులు ఇంటి వద్ద చదివించాలని, పనులు చెప్పరాదని వారికి సూచించారు. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడ శ్రద్ధ తీసుకున్నప్పుడే ఉన్నత ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్, హెచ్‌ఎం వరలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ నాగరాజు, పీఆర్‌ఏఈ నితిన్ రెడ్డి, కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు.

వరిదేల శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు



కొల్లాపూర్: పట్టణంలోని వరిదేల శమీవృక్షం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవికి భక్తులు సమర్పించిన వడి బియ్యంతో భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. భక్తులు శమీవృక్షాన్ని దర్శించుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

రాజకీయ భవిష్యత్‌పై త్వరలో కార్యాచరణ

కొల్లాపూర్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మైనార్టీ సెల్ నాయకులు సమావేశమయ్యారు. తమ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావుకు పార్టీ టికెట్ రాకపోవడం, జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ అభ్యర్థి కావడం వంటి అంశాలపై మాట్లాడారు. జగదీశ్వర్‌రావువర్గానికి చెందిన తామంతా రాజకీయ భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు బాలపీరు, ప్రధాన కార్యదర్శి సయ్యద్, హుస్సేన్, మహ్మద్, జహంగీర్, వహీద్, నిరంజన్, అబూబాకర్, నజీర్, షబ్బీర్ తదితరులున్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు మృతి

కొల్లాపూర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ వెటర్నరీ ఉద్యోగి, తెలంగాణ ఉద్యమకారుడు కంటి రామస్వామి(62) శనివారం ఉదయం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కొల్లాపూర్ జేఏసీ చైర్మన్‌గా ఈయన పనిచేశారు. ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన మృతికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, టీఎన్‌జీఓ, ఉద్యోగ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

కొనసాగుతున్న ‘గుట్ట’ దారి పనులు



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం వద్దకు గుట్టపై రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రామస్వామి గుట్టపై పురాతన కాలంలో నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి అయ్యప్ప దేవాలయం పక్కన ఉన్న గుట్ట నుంచి కొత్తగా మట్టి రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వేసిన రోడ్డు వర్షాలకు కోతకు గురవడంతో దానిపై వాహనాలు వెళ్లడానికి వీలు కావడం లేదు. దీంతో మట్టిని వేయించి చదును చేయిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణం కోసం కొత్తగా ఏర్పాటైన కమిటీ ద్వారా దాతల సాయంతో పనులు చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

అడ్డాకుల: మండలంలోని రాచాల, పొన్నకల్, కందూర్ గ్రామాల్లో శనివారం సాయంత్రం కేంద్ర బలగాలతో జిల్లా పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ కృష్ణయ్య, అడ్డాకుల, మూసాపేట ఎస్‌ఐలు మాధవరెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.